కథ

# గబ్బిలం.. ది అన్‌టచబుల్

డాక్టర్ ఎమ్ సుగుణ రావు
97046 77930



**వాషింగ్టన్ డిసి.** అమెరికా రాజధాని. ఆ నగరంలోని ఒక ప్రముఖ హోటల్ ప్రాంగణంలోకి భారత రాయబారి కార్యాలయంవారి వాహనం వచ్చి ఆగింది. హోటల్ గేటు ముందున్న సూట్ వేసుకున్న వ్యక్తి కారు తలుపు తెరిచాడు. కారులోంచి దిగాడు ఒక 30 ఏళ్ల యువకుడు. తెల్లగా, పొడుగ్గా ఉన్నాడు. హోటల్ రిసెప్షన్ వైపు నడిచి, తన ఐడెంటిటీ కార్డు చూపించాడు.

''డాక్టర్ హాసన్ మంగళగిరి, ఐఎఫ్ఎస్. పోస్టెడ్ యాజ్ థర్డ్ సెక్రటరీ. ఇండియన్ ఎంబసీ''..

ఆ రిసెప్షనిస్ట్ ఆ కార్డులోని ఆ వివరాలు పైకి చదువుతూ, నమస్కారం చేసి..

''హేవ్ ఎ సీట్ సార్. యువర్ రూమ్ విల్ బి రెడీ ఇన్ ఎ మూమెంట్'' అన్నది.

హాసన్ ఆ మాటలకు చిన్నగా నవ్వి..

''మై అపార్ట్‌మెంట్ ఈజ్ నాట్ యెట్ రెడీ. ఓన్లీ ఫర్ కపుల్ ఆఫ్ డేస్'' అన్నాడు.

పావుగంట తర్వాత ఆ హోటల్ అటెండెంట్ హాసన్ లగేజీతో రూమ్‌కు వెళ్లే లిఫ్ట్ ఎక్కాడు. హాసన్ అతన్ని అనుసరించాడు.

* * *

తర్వాతి రోజు ఉదయం ల్యాప్‌టాప్‌లో పని చేసుకుంటున్నాడు హాసన్. తలుపు కొట్టిన చప్పుడు.

''ఎస్ ప్లీజ్'' అన్నాడు.

పద్దెనిమిదేళ్ల యువకుడు. మల్లెపూవులాంటి తెల్లని యూనిఫామ్. నెత్తికి క్యాప్. నల్లటి ఆ శరీరం బాగా కసరత్తు చేసినట్టుగా ఉంది. నవ్వుతూ వచ్చిన ఆ వ్యక్తి..

''రూమ్ సర్వీస్ సార్! బాత్రూమ్ క్లీనింగ్'' అన్నాడు.. సెల్యూట్ చేసి.

ల్యాప్‌టాప్ లోంచి తలెత్తి చూసిన హాసన్..

''వెయిట్ ఫర్ ఎ మూమెంట్'' అన్నాడు.

ఆ వ్యక్తి అలాగే నిలబడిపోయి చూస్తూ..

''షల్ ఐ కమ్ లేటర్ సార్'' అంటూ వెనక్కి తిరిగాడు.

''ప్లీజ్ బి సీటెడ్ ఫర్ ఎ వైల్'' అంటూ సోఫా చూపించి.. అతని చేతిలోని బకెట్టు, ఇతర సామగ్రి తీసుకొని తనే వాష్ రూమ్‌లోకి వెళ్లబోతుంటే..

''నో సార్.. నో సార్! ఐ విల్ లూజ్ మై జాబ్ సార్. ప్లీజ్.. ప్లీజ్..'' అంటూ వెంటపడ్డాడు ఆ రూమ్ బాయ్.

హాసన్ ఆ హోటల్ రూమ్ తలుపు వేసి..

''నో ప్రాబ్లమ్. ఐ విల్ నాట్ రివీల్. దిస్ ఈజ్ ఆల్రెడీ వాష్డ్ ప్రోపర్లీ. ఎనీహౌ.. ఐ విల్ డూ ఇట్'' అంటూ చాలా శుభ్రంగా ఉన్న ఆ టాయిలెట్‌ను మళ్లీ కడిగి.. ఆ సామగ్రిని అతనికి అందించాడు.

ఆ బ్లాక్ అమెరికన్ విస్మయంగా, ఆశ్చర్యంగా హాసన్ వంక చూస్తూ ఉండిపోయాడు.

రెండో రోజూ అదే తంతు. తనని టాయిలెట్ కడగనివ్వకపోవడం, తనే కడుక్కోవడం, తనను బలవంతంగా సోఫాలో కూర్చోబెట్టడం ఆ యువకుడికి ఆశ్చర్యం కలిగించింది. మూడో రోజు ఇక అడిగేశాడు.

''యూ ఆర్ అమేజింగ్ సార్. వాట్ మేడ్ యూ టు డూ దిస్ జాబ్. ది జాబ్ ఈజ్ ఎలోకేటెడ్ టు మి. యూ ఆర్ అవర్ ఫారెన్ డెలిగేట్ అండ్ హై ప్రొఫైల్ డిప్లమేట్'' అంటూ చేతులు కట్టుకొని నిలబడ్డాడు.

హాసన్ ఆ మాటలకు నవ్వి, ఊరుకున్నాడు.

* * *

సివిల్ సర్వీస్ పరీక్షలో సఫలీకృతులైన నాలుగు వందల మందిలో ఇండియన్ ఫారెన్ సర్వీస్ ఎంచుకొన్న బృందంలో హాసన్ ఒకడు. మూడు నెలల శిక్షణలో తమకు న్యాయ నిర్వహణ, ఆర్థిక స్థితిగతులు, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ వంటి వాటి మీద శిక్షణ ఇచ్చారు. శిక్షణలో భాగంగా తాను రాసిన జనరల్ రైటింగ్.. అంటే ప్రతిరోజూ జరిగిన అనుభవాలు, తేదీలవారీగా రాసిన డైరీ చూస్తూ కూర్చున్నాడు. తమ శిక్షణలో భాగంగా వివిధ రాష్ట్రాల్లోని గ్రామీణ ప్రాంతాలకు గ్రామ సందర్శన పేరిట తీసుకువెళ్లేవారు. అయితే తాను తన బృందంతో మహారాష్ట్రలోని కొన్ని మారుమూల పల్లెలను సందర్శించాడు. ఇంకా మేన్యువల్ స్కావెంజరింగ్.. అంటే పొట్టకూటి కోసం సఫాయి, మురుగు పనులు చేస్తున్నవారి జీవితాలను పరిశీలించాడు.

సఫాయి కర్మచారుల జీవనం గురించి సివిల్స్ ఇంటర్వ్యూలో అడిగారు. కారణం తాను పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో ఆ విషయం మీద ఒక ప్రాజెక్ట్ చేశాడు. ఆరోజు ఇంటర్వ్యూలో తనేం చెప్పాడు?

'సాటి మనుషుల మలాన్ని ఎత్తి జీవించే దుస్థితిలో ఈ దేశంలో ఇంకా లక్షలాది మంది బతుకుతున్నారు. అయితే సఫాయి కర్మచారులను పనిలో పెట్టుకోవడాన్ని వ్యతిరేకిస్తూ పొడి పాయిఖానాల నిషేధ చట్టం 1993లో అమలులోకి వచ్చింది. అయితే దేశవ్యాప్తంగా నేటికీ లక్షలాది మంది పారిశుధ్య కార్మికులు డ్రైనేజీ గుంతల్లోకి దిగి శుభ్రం చేస్తున్నారు. చేతులతో మానవ